
# సింగిల్ పేజీ కథలు

## పొరపాటు

గుహలో నుండి బయటపడ్డట్టు చాలా కష్ట సాధ్యం మీద సిటీబస్సులో నుండి బయటపడ్డాడు రాజారావ్. జైలు నుండి రిలీజ్ అయిన యావజ్జీవ ఖైదీలా ఫీలయ్యాడు.

ఇంటి దగ్గరకు వచ్చాక పిల్లలకు స్టేషనరీ కొనాలన్న విషయం గుర్తొచ్చి పక్కనే వున్న బుక్ స్టాల్‌కేసి నడిచాడు. పర్సు కోసం జేబులో చెయ్యిపెట్టి షాక్ తిన్నాడు రాజారావ్. జేబు ఖాళీగా వుంది! అంటే... ఆఫీసు నుండి సిటీబస్సులో వస్తుంటే ఎవడో తన పర్సు కొట్టేశాడన్నమాట! అందులో మూడువేల రూపాయలున్నాయి. ఇంటికి కావాల్సిన సరుకులు తేవడానికి పెట్టుకున్న డబ్బు అది.



ఇంటికి వెళ్ళగానే తన భార్య ఆ మూడువేలు అడుగుతుంది. ఏం సమాధానం చెప్పాలి? నిజం చెబితే అర్థం చేసుకోదు. పైపెచ్చు నాలుగైదు రోజులు నా చేతగానితనాన్ని దెప్పిపొడుస్తూ సూటి పోటి మాటలు మాట్లాడుతుంది. ఇప్పుడేం చేయాలి? చివరికి ఇంట్లో చెప్పకపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు రాజారావ్.

నెలలో చివరి రోజులు కాబట్టి తన ఫ్రెండ్స్‌లో ఎవర్ని అడిగినా ప్రయోజనం ఉండదని తనకి తెలుసు. ఇక తను అడగ్గానే డబ్బు ఇచ్చేది వడ్డీ వ్యాపారి శ్రీశైలం ఒక్కడే!

అతని దగ్గర్నుంచి మూడువేలు అప్పు తీసుకుని "థ్యాంక్స్" అన్నాడు రాజారావ్.

"నీ బోడి థ్యాంక్స్ ఎవడిక్కావాలి. నెల తర్వాత అసలు, వడ్డీ తెచ్చివ్వు" అన్నాడు పాన్ నములుతూ శ్రీశైలం. అతను ఆమాట నిజంగా అన్నాడని తెలిసినా జోక్ అయినట్టు రాని నవ్వును తెచ్చుకుని నవ్వేశాడు రాజారావ్.

* * *

ఇంటికొచ్చిన భర్తకి కాఫీ ఇస్తూ "ఏవండీ... ఆ మూడువేలు ఇవ్వండి. నేనెళ్ళి సరుకులు తీసుకుని వస్తాను" అంది భార్య భావన.

తన పర్సు బస్సులో ఎవడో కొట్టేశాడని చెబితే తన భార్య రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దామని "సారీ భావనా! బస్సులో నా పర్సు ఎవడో దొంగ వెధవ కొట్టేశాడు" అన్నాడు రాజారావ్ మొహం దీనంగా పెట్టి.

"ఓరి దేవుడో! మూడువేలు పోగొట్టుకుని వచ్చి, ఆ విషయాన్ని ఇంత నింపాదిగా చెబుతున్నారా! బస్సులో ఎవడో మీ పర్సు కొట్టేస్తుంటే మీరేం చేస్తున్నారు? నిద్ర పోతున్నారా? ఆ మాత్రం స్పృహ లేకుండా వుంటారా! నెల రోజులకు సరిపడే సరుకులొచ్చేవి... మీరిచ్చే ఐదువేలతో ఎలాగోలా ఇల్లు గడుస్తోంది. వీలైనంత పొదుపుగా నేను సర్దుకుపోతుంటే, మీరిలా వేలకి వేలు పోగొట్టుకుని వస్తే ఎలాగండీ?" అంటూ నా నా లెక్కలు వేస్తూ నా అసమర్థతను ఎండగట్టింది.

"ఏయ్ భావనా! ఆపు నీ ఏడుపు... ఎందుకలా గొడవ చేస్తావ్? ఊరికే సరదాగా అబద్ధం చెప్పాను... ఇదిగో మూడువేలు!" అని ఇచ్చాడు రాజారావ్.

ఏమాత్రం గిల్టీనెస్ లేకుండా ఆ మూడువేలు తీసుకుని కిరాణాషాపుకి వెళ్ళిపోయింది భావన. తన భార్య నైజాన్ని గురించి ఆలోచిస్తూ మంచం మీద పడుకున్నాడు.

ఆరోజు ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చింది అతనికి.

భావన స్టౌవ్ మీద నుండి పాలు దించుతూ పొరపాటుగా కింద పడేసింది. హాల్లో పేపర్ చదువుకుంటూ వున్న తను గిన్నె పడిన శబ్దం విని పరుగెత్తుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళి "ఏమైంది?" అన్నాడు.

"పొరపాటుగా జారి కింద పడిపోయిందిలే" అని బట్టతో నేల తుడవడం మొదలుపెట్టింది.

"నీమీద ఏమైనా పడ్డాయా?" అడిగాడు తను.

"లేదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పింది.

తనమీద నాకున్న అభిమానం నామీద తనకెందుకు లేదు. అలాంటి పొరపాటు తనిప్పుడు చేస్తే తను అర్థం చేసుకోదు.

పొరపాటుకు పది రూపాయల పాలైనా, పదివేలు డబ్బు అయినా ఒక్కటే! అర్థం చేసుకోనివాళ్లకు అబద్ధం చెప్పడంలో తప్పులేదని తనకి తానే సర్ది చెప్పుకున్నాడు.

కొన్ని క్షణాలు కూడ గడవకముందే భార్యకి తన మీద ఎంతో ప్రేమ ఉందని తెలియజేసే కొన్ని సంఘటనలు మనసులో సినిమా రీలులా తిరిగాయి.

ఎందుకు తను ఆమెను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నాడు? తప్పు తనలో ఉందా? ఆమెలోనా?

దీర్ఘంగా ఆలోచించి 'మరో యాంగిల్లో ఆలోచించి చూద్దాం!' అనుకున్నాడు.

డబ్బు పోయిందని చెప్పగానే ఆమె అన్న మాటలు వరసగా గుర్తుకొచ్చాయి. ఆ మాటలు మళ్లీ రివైండ్ చేసుకున్నాడు. చివరగా అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "...వీలైనంత పొదుపుగా నేను సర్దుకుపోతుంటే, మీరిలా వేలకి వేలు పోగొట్టుకుంటే ఎలాగండీ" అంది. అలా అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో సన్నటి నీటిపొర తన దృష్టి నుంచి దాటిపోలేదు. కానీ అప్పుడు తను దాన్ని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఆలోచిస్తే, కష్టపడి సంపాదించే డబ్బు పట్ల జాగ్రత్త కూడ అంతగానే ఉండాలనే ఆమె ఆంతర్యం తనకి అర్థమైంది.

ఇకముందు తన జేబులో ఎక్కువ డబ్బు ఉన్నప్పుడు, దానిపట్ల తగిన జాగ్రత్త వహించాలని నిర్ణయం తీసుకున్నాక, రాజారావ్‌కి హాయిగా నిద్రపట్టింది.

-ఎం.గాంధీ (హైదరాబాద్)

## గులాబీలు

సాయంత్రం అయిదు గంటలు అవుతోంది.

లక్ష్మి గేటు దగ్గర నిలబడి కూతురు వీణ కోసం ఎదురుచూస్తోంది. రోజూ ఈ సమయానికి వచ్చేది. బస్సు దొరకలేదేమో అనుకుంటూ లోపలికి వచ్చింది. ఇంతలో "అమ్మా" అంటూ వీణ లోపలికి వచ్చింది.

"ఏమ్మా.. ఈరోజు లేటయ్యిందే?" అని లక్ష్మి అడిగింది.

"మా కాలేజీలో సెమినార్ జరిగిందమ్మా, అందుకే ఆలస్యం అయింది. అమ్మా.. చాలా ఆకలిగా ఉంది" అంది ఏమైనా పెట్టమన్నట్టు.

"నీకు ఇష్టమని మిరపకాయబజ్జీలు చేసి ఉంచాను. కాళ్ళు కడుక్కొని రా" అంది.

ఇంతలో లక్ష్మి టిఫిన్ ప్లేట్, మంచినీళ్ళు తీసుకొని పెరటిలో తులసి చెట్టు దగ్గరకు వచ్చి కూర్చుంది. వీణ బట్టలు మార్చుకొని వచ్చి టిఫిన్ ప్లేటు తీసుకుని తింటూ "అమ్మా.. నీ చిన్నప్పటి విషయాలేవైనా చెప్పు, చాలా బోరుగా వుంది" అంది.

కూతురు తన చిన్ననాటి విషయాలు అడగగానే ఆమె మనసు గతంలోకి వెళ్లిపోయింది. అప్పటి విషయాలన్నీ జ్ఞాపకం చేసుకుంది.

"వీణా! మాది చిన్న పెంకుటిల్లు. మా తాతగారి ఇల్లు కూడ మా వీధిలోనే వుండేది. ఒకరోజు మా అమ్మ నన్ను పిలిచి, అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి పండుగ ఏరోజు చేస్తున్నారో అడగమంది. నేను తాతగారింటికి వెళ్ళేటప్పటకి అమ్మమ్మ సిగ చుట్టుకుంటోంది. తాతగారు ఉయ్యాల బల్లమీద కూర్చున్నారు. "ఏంటిరా లచ్చులూ! ఈమధ్య మా ఇంటికి రావటం మానేసావు?"

నన్ను 'లచ్చులు' అని ప్రేమగా పిలవటం తాతయ్యకి, అమ్మమ్మకి ఎంతో ఇష్టం.

"స్కూల్ నుంచి వచ్చేటప్పటికి ఆలస్యం అవుతోంది. తాతయ్యా, అందుకని రావటం లేదు. ఇంతకీ పండుగ ఏరోజు తాతయ్యా?" అని అడిగాను. "రేపేనమ్మా!"

ఇంతలో అమ్మమ్మ వచ్చిందక్కడికి. "ఏమే లచ్చులూ నా సిగ ఎలా వుందే?"

"ఓ... బాగుంది అమ్మమ్మా!" అన్నాను.

అమ్మమ్మ సిగ వేసుకునేది. సిగచుట్టి, దానికి కుప్పెర పెట్టి, దాని చుట్టూ మల్లెపువ్వుల దండ చుట్టేది.

"నీకు ఒక పని చెపుతాను చేస్తావా?" అంది అమ్మమ్మ. నేను తల ఊపాను.

"మేడ మీద గులాబీ మొక్కలకు నీళ్ళు పోయాలి. నాకు మోకాళ్ల నొప్పులు. నేను మేడ ఎక్కలేను" అని చెప్పింది.

నేను సరే అన్నాను.

అమ్మమ్మ కొడుకు శివ, కోడలు ఉమ. వాళ్ళకు ఒక పాప. దాని పేరు అర్చన. కాని అందరు ముద్దుగా దాన్ని సిరి అని పిలిచేవాళ్లు. నాకు మామయ్య అంటే భయం, ఉమక్కతో చనువుగా ఉండేదాన్ని. అక్క గురించి అడిగితే, 'మీ ఉమక్క పండగకి ఊరెళ్ళింది" అని చెప్పింది అమ్మమ్మ.

"నేను మేడ మీదకి వెళ్ళి మొక్కలకి నీళ్ళు పోసి వస్తాను అమ్మమ్మా!" అంటూ వెళ్లాను.

"మా లచ్చులు బంగారం" అంది అమ్మమ్మ.

మేడ ఎక్కగానే నాకు స్వర్గంలోకి వెళ్ళినట్టు అనిపించింది. మేడ పైన రంగురంగుల గులాబీలు విరగబూసి వున్నాయి. అవి చూసి నేను మొక్కలకి నీళ్ళు పోయడం కూడ మర్చిపోయి, అందమైన ఆ గులాబీలనే చూస్తూ ఉండిపోయాను.

ఇంతలో అమ్మమ్మ "లచ్చులూ" అని కేక వేసింది. నేను ఉలిక్కిపడ్డాను.

"మొక్కలకి నీళ్లు పెట్టడానికి కుళాయి తిప్పుకున్నావా లేదా?" అని అడిగింది.

"తిప్పుతున్నాను అమ్మమ్మా!" అంటూ కుళాయి తిప్పి మొక్కలన్నింటికి నీళ్ళు పోశాను.


"లచ్చులూ! ఒకసారి ఇటు కనిపించు" మళ్లీ అమ్మమ్మ గట్టిగా పిలిచింది.

పిట్టగోడ దగ్గర నుంచి చూశాను. అమ్మమ్మ మెట్ల దగ్గర నిలుచుంది. "లచ్చులూ.. నీళ్ళు పోయడం అయ్యాక, నీకు నచ్చిన రెండు గులాబీలు కోసుకో.. ముళ్ళుంటాయి జాగ్రత్త!" అని చెప్పింది.

"సరే అమ్మమ్మా" అన్నాను. కాని అక్కడున్న గులాబీలలో ఏది కోయాలో తెలియలేదు. అన్నీ అందంగానే ఉన్నాయి మరి. నేను లేత గులాబీరంగు గౌను వేసుకున్నాను. దానికి తగ్గట్టుగా ఉంటుందని, లేత గులాబీ రంగు ఒకటి, మరొకటి ఎరుపురంగు పువ్వులను కోసుకున్నాను.

"ఇదిగో ప్రసాదం" అంటూ అమ్మమ్మ అరటిపండు ఇచ్చింది. నేను తీసుకొని ఇంటికి వచ్చాను.

మా అమ్మ ఎర్ర గులాబీని నీళ్ళలో వేసి ఉంచింది. నేను మరునాడు స్కూల్‌కి వెళ్ళేటప్పుడు పెట్టుకున్నాను.



సాయంత్రం అమ్మమ్మ దగ్గరికి వెళ్ళాను. నీళ్ళు పోయమని చెబితే మళ్ళీ గులాబీలను చూడవచ్చుననుకున్నాను. తీరా వెళ్ళేరికి వాళ్ళింట్లో బంధువులు ఉన్నారు. పైగా మామయ్య కూడా ఉన్నాడు. అందుకని నేను వెళ్ళిపోతుంటే తాతయ్య నన్ను చూచి "లచ్చులూ.. వెళ్ళిపోతున్నావేంటి?" అడిగాడు.

అమ్మమ్మ అంది "శివ ఉంటే అది రాదు."

"మామయ్యే కదా! ఎందుకు భయం!" అన్నాడు తాతయ్య. నేను మాత్రం తిరిగి చూడకుండా వచ్చేశాను.

నాలుగు రోజులు గడిచాయి.

మా యింటి ముందు బావి ఉంది. తాతయ్య ఆరోజు వాళ్ళ బోరు పాడయినందువల్ల మడి నీళ్ళకోసం మా యింటికి వచ్చారు. "ఏమిటి లచ్చులూ.. మా ఇంటికి ఈమధ్య రావటం మానేసావు. టీవీ చూడటానికి కూడ రావట్లేదేంటి? మీ శివ మామయ్య లేడులే! ఊరు నుంచి మీ ఉమక్క, సిరి వచ్చారు."

"సరే తాతయ్యా, నేను సాయంత్రం వస్తాను" అన్నాను. స్కూలు నుంచి రాగానే వెళ్ళాను. సిరి పరుగున వచ్చి నన్ను గట్టిగా పట్టుకుంది.

"చూసావే లచ్చులూ.. దానికి నువ్వంటే ఎంత ఇష్టమో! ఊరికి వెళ్ళినా నిన్నే కలవరించేదట" అని చెప్పింది అమ్మమ్మ. తర్వాత నేను మేడ పైకి వెళ్ళాను. "అక్కా అని పిలిచాను" "రా లక్ష్మీ.." అంటూ ప్రేమగా పిలిచింది ఉమక్క. "గులాబీలు చూడు, ఎంత బాగున్నాయో! మొన్న నువ్వు నీళ్ళు పోశావంట కదా! నాకు కూడ గులాబీలు అంటే ఇష్టం. మా పుట్టింట్లో గులాబీ మొక్కలు పెంచాను" అని చెప్పింది ఉమక్క. "అక్కడ కూడ ఇన్ని గులాబీ మొక్కలు ఉన్నాయా?" అని అడిగాను.

"ఉన్నాయి."

"అక్కా నాకు కూడ పూల మొక్కలన్నా, గులాబీ పువ్వులన్నా చాలా ఇష్టం. ఇక్కడున్న గులాబీ మొక్కలని రోజూ చూడాలనిపిస్తోంది అక్కా!"

"నీకు గులాబీలంటే అంత ఇష్టమా! నేను నీకు కొన్ని మొక్కలు ఇస్తాను, మీ ఇంటిముందు పెంచుకో" అంది.

ఇంటికి వచ్చాక అమ్మకీ విషయం చెప్పాను. "ఉమక్క నాకు గులాబీ మొక్కలు ఇస్తానంది, తెచ్చుకోనా!"

"అక్క ఇస్తేమట్టుకు నువ్వు ఎక్కడ పెంచుకుంటావు? మనకు మొక్కలను పెంచుకొనేందుకు చోటు లేదుకదా! కావాలంటే నీకు జడలో పెట్టుకొనేందుకు కొనిస్తాను" అంది అమ్మ. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెళ్ళయాక అత్తగారింట్లో కూడ చోటు లేదు. గులాబీ మొక్కల్ని పెంచాలనే నా ఆశ అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత నువ్వు, తమ్ముడు పుట్టారు. ఇంక మీతోనే సరిపోతోంది... ఈ ఇంట్లో మొక్కలను పెంచేందుకు కాస్త చోటు ఉంది. కాని ఒకవేళ ఇల్లు మారితే అక్కడ మొక్కలకు స్థలం ఉంటుందో లేదో అని ఇల్లు మారలేదు.

"అమ్మా.. నీకు గులాబీలంటే అంత ఇష్టమా?" అని ఆశ్చర్యపోయింది వీణ.

ఆ మరునాడు 'మదర్స్ డే' సందర్భంగా వీణ తన తల్లి లక్ష్మికి గులాబీ మొక్కలని తెచ్చి ఇచ్చింది. ఇంటి ముందు గులాబీ మొక్కలని పెంచాలనే తన ఆశ ఇన్నాళ్ళకు నెరవేరుతున్నందుకు లక్ష్మి కళ్ళల్లో ఆనందభాష్పాలు.

కూతురు వైపు ప్రేమగా చూసిందామె.

-మాచెర్ల జయలక్ష్మి (వికాస్ నగర్)